అలుగు పారుతున్న గట్టు చెరువు

పొల్కెపహాడ్‌లో పంట పొలాలపై ప్రవహిస్తున్న నీరు

మత్తడి దూకిన చెరువులు

- పొంగిన వాగులు, వంకలు
- పంటపొలాలకు చేరిన వరద నీరు
- పలు గ్రామాల రాకపోకలకు అంతరాయం

మల్దకల్, సెప్టెంబర్ 6: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఎల్కూర్ పెద్దచెరువు, అమరవాయిలో చెరువు అలుగులు పారాయి. మండలంలో 53.2 మి.మీ. వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. పంట పొలాలకు వర్షం నీరు చేరడంతో పూర్తిగా నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. శుక్రవారం ఏవో రాజశేఖర్ ఆదేశాల మేరకు ఏఈవోలు నీట మునిగిన పంటలను పరిశీలించారు. మండలంలో దాదాపుగా 100 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందన్నారు.

దంచికొట్టిన వాన

ఇటిక్యాల, సెప్టెంబర్ 6: వరుస పెట్టి కురుస్తున్న వర్షాలకు గురువారం రాత్రి కురిసిన భారీ వానకు మండలంలోని వాగులు వంకలు పొంగి పొర్లాయి. దీంతో ప్రజల సాధారణ జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. మండల కేంద్రంలోని ఊర చెరువు అలుగు పారడంతో ఎస్సీ కాలనీ ప్రజలకు గ్రామంతో సంబంధాలు తెగిపోయాయి. అలాగే మండలంలోని వివిధ గ్రామాల రైల్వే అండర్ పాస్‌లలో నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కేటీదొడ్డిలో 56.5 మి.మీ. వర్షపాతం

కేటీదొడ్డి, సెప్టెంబర్ 6: మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. మండలంలో 56.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

గట్టులో 48.4మి.మీ. వర్షపాతం

గట్టు, సెప్టెంబర్ 6: గట్టు పెద్ద చెరువు గురువారం రాత్రి అలుగు పారింది. 2022లో చెరువు నిండగా, మళ్లీ ఇప్పుడు నిండి నీటితో కళకళలాడుతోంది. అదేవిధంగా సల్కాపురం చెరువు కూడా అలుగు పారింది. కాగా ఉమ్మడి గట్టు మండలంలో ఆరు నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. గట్టు చెరువు కింద 238 ఎకరాల ఆయకట్టు ఉండగా, సల్కాపురం కింద 160 ఎకరాల ఆయకట్టు ఉంది. మాచర్ల చెరువు అలుగు ఒకటి, రెండు రోజుల్లో పారే అవకాశాలు కనబడుతున్నాయి. 60ఎకరాలు ఆయకట్టు ఉన్న కుచినెర్ల కొత్త చెరువు, 85 ఎకరాల ఆయకట్టు ఉన్న పెద్ద చెరువులు అలుగులు పారాయి. 130 ఎకరాల ఆయకట్టు ఉన్న బలిగేర ఊరచెరువు కూడా అలుగు పారింది. చెరువులు నిండడంతో రైతుల్లో యాసంగిపై ఆశలు పెరుగుతూ వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. గట్టులో శుక్రవారం 48.4మి.మీల వర్షపాతం నమోదైంది.

అలుగుపారుతున్న గువ్వలదిన్నె చెరువు

ఉధృతంగా ప్రవహించిన పెద్దవాగు

మానవపాడు, సెప్టెంబర్ 6: గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి మానవపాడు–అమరవాయి మధ్యన పెద్దవాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాత్రి కురిసిన వర్షానికి నాలుగు అడుగుల మేర నీరు రావడంతో ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నారాయణపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సుమారు 4 అడుగుల మేర నీరు నిల్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎర్రవల్లి మండలంలో భారీ వర్షం

ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 6: ఎర్రవల్లి మండలంలో గురువారం రాత్రి భారీవర్షం కుసింది. మండలంలోని వాగులు పొంగి పొర్లడంతో వర్షపు నీరు పంటపొలాల్లో చేరి రైతులకు తీవ్ర నష్టం చేకూరింది. గార్లపాడులోని పెద్దవాగు, షేక్‌పల్లి పెద్దవాగు, వల్లురూ పెద్దవాగు ఉధృతంగా పారడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

నీటి ఉధృతికి పంటనష్టం

గోపాల్ పేట, సెప్టెంబర్ 6: మండలంలోని పొల్కెపహాడ్ మొగళ్ల చెరువు అలుగు ఉధృతంగా పారుతుండడంతో నీళ్లు పంట పొలాలకు చేరుతున్నాయి. దీంతో భారీగా పంటనష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పంట పొలాలపై ప్రవహిస్తున్న నీటిని సమీక్షించి, పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

అలుగు పారుతున్న ఇటిక్యాల ఊరచెరువు

పరిసరాల్లో నీటినిల్వలు ఉండకుండా చూడాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 6: పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, గణపసముద్రం రిజర్వాయర్, కర్నెతండాలో కలెక్టర్ పర్యటించారు. కేజీబీవీలో డెంగీ కేసు నమోదు కావడంతో సందర్శించారు. అన్ని కేజీబీవీల్లో పారిశుధ్య పనులు చేయించాలని జీసీడీవో శుభలక్ష్మికి ఆదేశించారు. డెంగీ కేసు నమోదు కావడానికి కారణాలను వైద్యసిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేయించాలని, నిల్వనీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా వ్యాధులు ఎందుకు వస్తాయనేది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులతో మాట్లాడి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అదేవిధంగా గణపసముద్రం రిజర్వాయర్ భూసేకరణ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా సర్వే చేసిన భూమికి పెగ్‌మార్కింగ్ పూర్తిచేయాలని, అవార్డు పాస్ చేసి ఇరిగేషన్ అధికారులకు స్థలం అప్పగించాలని సూచించారు. అనంతరం కర్నెతండాను సందర్శించి వృద్ధాశ్రమం, జీపీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. జీపీ భవనానికి విద్యుత్, ధర్వాజాలు త్వరగా అమర్చి పనులు పూర్తిచేయాలని పీఆర్ సహాయ ఇంజినీర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఏవో గోవింద్‌నాయక్, ప్రత్యేక అధికారి సుధీర్‌రెడ్డి, జీసీడీవో శుభలక్ష్మి, తాసీల్దార్ పాండు, ఎంపీవో తదితరులు ఉన్నారు.

బియ్యం ఇవ్వని మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 6: పుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు బియ్యం ఇవ్వని మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సివిల్ సప్లయ్ అధికారులతో సీఎంఆర్ రైస్‌పై సమీక్ష నిర్వహించారు. బియ్యం ఇస్తున్న రైస్ మిల్లులను ప్రసంశించారు. వడ్లు తీసుకొని బియ్యం ఇవ్వకపోవడం అనేది సరికాదని దీనివల్ల ప్రజాధనం వృథా అవుతుందన్నారు. బియ్యం ఇవ్వకుండా మొండిగా ఉన్న రైస్‌మిల్లులు అబ్రార్ ఇండస్ట్రీ, సత్య ఇండస్ట్రీ, తిరుమల ఇండస్ట్రీ, శ్రీవేంకటేశ్వర్ ఇండస్ట్రీపై కేసులు నమోదు చేయాలని సూచించారు. యజమానులపై వెంటనే కేసులు బుక్ చేయాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లులపై చర్యలు తీసుకోకుండా కాలాయపన చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు. వరిధాన్యం తీసుకొని రైస్‌మిల్లులో ధాన్యం లేని రైస్ మిల్లులపై సమీక్ష నిర్వహించారు. బియ్యం ఇవ్వని రైస్ మిల్లులు ఇక నుంచి ధాన్యం ఇవ్వొద్దని సివిల్ సప్లయ్ అధికారిని ఆదేశించారు. ఇప్పటికే

గణపసముద్రం రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఫారం–2 ద్వారా నోటీస్ ఇచ్చిన మిల్లులకు ఫారం 3,4 ద్వారా నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి కాశీ విశ్వనాథ్, ఎండీ ఇర్ఫాన్, డీటీలు పాల్గొన్నారు.

రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దు

పెద్దమందడి, సెప్టెంబర్ 6: రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని జంగమాయిపల్లిలో వ్యవసాయ అధికారులు స్వీకరిస్తున్న దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో అర్హులైన 25మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని వ్యవసాయ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీఏవో గోవింద్‌నాయక్, ప్రత్యేక అధికారి సుధీర్‌రెడ్డి, జీసీడీవో శుభలక్ష్మి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, సెప్టెంబర్ 6: రేవల్లి మండల కేంద్రానికి చెందిన పంచాయతీ కార్యదర్శి తప్పెట పరశురాం తండ్రి తప్పెట కోటయ్య (85) అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. కోటయ్య పార్థివదేహం వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ సేనాపతి, జెడ్పీటీసీ భీమయ్య, వైస్ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి ఎంపీటీసీ కురుమత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రూ.5లక్షల ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, సెప్టెంబర్ 6: మండల కేంద్రానికి చెందిన షేక్షావలి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే విజయుడు దృష్టికి రావడంతో ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి రూ.5లక్షల ఎల్‌వోసీని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 6: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు, అవహేళన చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వేణుయాదవ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా వేణుయాదవ్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి నిర్వహించిన ప్రెస్‌మీట్‌పై అసత్య ఆరోపణలు, అవహేళన చేస్తూ వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టిన అంబటి రమేశ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు నాగేంద్రయాదవ్, పురుషోత్తంరెడ్డి, సేనాపతిచారి, గట్టు సతీశ్, శివారెడ్డి, సురేశ్, రమేశ్, ఆంజనేయులు, రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణయ్య ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

మట్టి విగ్రహాలను అందజేస్తున్న కలెక్టర్ సంతోష్

- కలెక్టర్ సంతోష్

గద్వాల, సెప్టెంబర్ 6: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సహకరించడానికి మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. శుక్రవారం ఐడీవోసీ ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తయారు చేయించిన 2వేల మట్టి గణపతి విగ్రహాలను కలెక్టర్ పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాల వినియోగం ఎంతో ముఖ్యమన్నారు. మట్టి గణపతులు గద్వాలకు వేయి, అయిజకు 500, అలంపూర్‌కు 250, వడ్డేపల్లికి 250 విగ్రహాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బందికి మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నర్సింగరావు, శ్రీనివాస్ అధికారులు రమేశ్‌బాబు, విమల, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లాప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 6: వినాయక చవితిని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు కలెక్టర్ సంతోష్ శుక్రవారం శుభాకాంక్షలు తెలియజేశారు. గణపతి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, స్వామి ఆశీర్వాదాలతో జిల్లాలో ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, శాంతి, ఆర్థిక స్థితి మెరుగుపడాలని అకాంక్షించారు.

సివిల్ సప్లయి హమాలీ రేట్లను పెంచాలి

కొత్తకోట, సెప్టెంబర్ 6: ఒప్పందం ప్రకారం 2024నుంచి సివిల్ సప్లయి హమాలీ రేట్లను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యాయుడు నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సివిల్ సప్లయి గోదాం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేండ్లకు ఒక సారి ప్రభుత్వం సివిల్ సప్లయి హమాలీ రేట్లను పెంచుతున్నారని, క్వింటాకు రూ.26 నుంచి రూ.35లకు కూలీ రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. దసరా పండుగకు స్వీట్లకు రూ.1200, బోనస్ రూ.6500 నుంచి పదివేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులకు ప్రావిడెంట్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే యూనిఫాంకు రూ.1300 నుంచి రూ.2వేలకు పెంచాలని, వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సమావేశంలో కార్మిక సంఘం నేతలు రాజు, బాలయ్య, శాంతన్న, చిన్న బాలయ్య, ధనుంజయ్, బాలయ్య తదితరులు ఉన్నారు.

ఇరువర్గాల ఫిర్యాదు

ధరూరు, సెప్టెంబర్ 6: పొలం తగాదాలో రెండు వర్గాలు దాడులు చేసుకుని ఒకరిపై, ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్న ఘటన మండలంలోని మన్నాపురంలో చోటుచేసుకున్నది. ఎస్సై అబ్దుల్ షుకూర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కురవ రాముడు, గోవిందు పొలం గెట్ల కోసం వాదులాడుతూ.. ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దాడిలో రాములుకు కొంచెం తీవ్ర గాయాలు కాగా, గోవిందు వర్గీయులకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ఇరువురి వ్యక్తుల ఫిర్యాదు మేరకు కౌంటర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రూ.5లక్షల పరిహారం

పెబ్బేరు, సెప్టెంబర్ 6: ఇటీవల భారీ వర్షాలకు ఇల్లు కూలి మరణించిన శ్రీరంగాపురం మండలం తాటిపాములకు చెందిన వడ్డె చంద్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకున్నది. వరద విపత్తుల నిధుల నుంచి ఆయన కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన డబ్బులు శుక్రవారం మృతుడి చిన్న కుమారుడు రాములు బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 6: విద్యార్థులు స్వయంకృషితో ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్కాలర్స్ విద్యా సంస్థల యాజమాన్య సభ్యులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో స్కాలర్స్ విద్యార్థులు ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించారు. ముందుగా మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కాలర్స్ యాజమాన్య సభ్యులు డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, వరప్రసాదరావు, నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు నర్సింహశర్మ, విజయ్‌కుమార్, కిష్టారెడ్డి, రవికుమార్, మల్లారెడ్డి, అనిల్‌కుమార్, కిశోర్, తిరుపతయ్య, పద్మ, సునీత పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ పార్టీలో విద్యార్థినులు

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 6: పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే జూనియర్ హాకీ నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ జాతీయ జట్టుకు వనపర్తి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొలమోనికుమార్ తెలిపారు. తేజ, బోలమోని కౌశిక్, భాస్కర్, దివాకర్ ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులకు జాతీయ జట్టులో పాల్గొనే అవకాశం కల్పించినందుకు హాకీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండా విజయ్‌కుమార్, భీంసింగ్‌కు ధన్యావాదాలు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను మహబూబ్‌నగర్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం, గద్వాల జిల్లా హాకీ అసోసియేషన్ ట్రెజరర్ నిరంజన్‌గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్, ఫిజికల్ డైరెక్టర్ అనిల్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

జాతీయ స్థాయికి ఎంపికైన వనపర్తి క్రీడాకారులు

గోపాల్‌పేట విద్యార్థుల ఎంపిక

గోపాల్‌పేట, సెప్టెంబర్ 6: మధ్యప్రదేశ్‌లో ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఆగస్టు 20నుంచి సెప్టెంబర్ 4వరకు కల్వకుర్తిలో నిర్వహించిన ఫుట్‌బాల్ క్యాంపులో అత్యంత ప్రతిభ కనబరిచి 22మంది విద్యార్థినులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కాగా, పాఠశాలకు చెందిన శైలజ, స్వరూప ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి తెలిపారు. వీరిని హెచ్‌ఎం రమాకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

దాడి కేసులో ముగ్గురికి జైలుశిక్ష

ఆత్మకూరు, సెప్టెంబర్ 6: కుటుంబంపై దాడి చేసిన కేసులో ముగ్గురికి జైలుశిక్ష విధించారు. వివరాల్లోకి వెళ్లగా మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన గుడిసె కృష్ణయ్య కుటుంబంపై అదే గ్రామానికి చెందిన వల్లూరి ఆశన్న కుటుంబసభ్యులు దాడిచేశారు. 11 సెప్టెంబర్ 2018 న గుడిసె కృష్ణయ్య మరుగుదొడ్డి నిర్మాణం కోసం సెప్టిక్ గుంత తవ్వగా తన ఇంటి ముందు సెప్టిక్ ట్యాంక్ తవ్వుతారా అంటూ వల్లూరి ఆశన్న కుటుంబీయులు దాడి చేశారు. ఈ ఘటనలో కృష్ణయ్య కుటుంబీయులు తీవ్రంగా గాయపడ్డారు. అప్పుడు కేసు నమోదు కాగా కోర్టులో వాదనలు ముగియగా శుక్రవారం మెజిస్ట్రేట్ తుది తీర్పును వెల్లడించారు. వల్లూరి ఆశన్న, వల్లూరి శ్రీను, వల్లూరి మహేందర్‌కు నాలుగు నెలలపాటు జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధించినట్లు ఏఎస్సై బీచుపల్లి తెలిపారు.

గణనాథుడి పూజకు వేళాయే..

నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, సెప్టెంబర్ 6: లంబోధరుడి ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణంతోపాటు పల్లెల్లో గణనాథులు కొలువుదీరే వేళయ్యింది. వినాయక చవితి సంబురాలు ప్రారంభమయ్యాయి. ఊరూవాడా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోనున్నారు. గంగమ్మ తనయుడి రాకకు భక్తులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఉత్సవ కమిటీలు ఏర్పాట్లతో నిమగ్నమయ్యారు. శనివారం వినాయక చవితిని పురస్కరించుకొని గణేశ్ ఉత్సవ కమిటీలు మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరణ చేస్తున్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సర్వం సన్నద్ధమవుతున్నారు. 11రోజుల పాటు గణనాథులు ప్రత్యేక పూజలందుకోనున్నారు. మండపాలకు వద్ద అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యం కల్పించాలని సూచిస్తున్నారు. గణేశ్ విగ్రహాలను పట్టణాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పల్లెలకు తరలిస్తున్నారు.

వనపర్తిలో మండపానికి గణేశుడిని తరలిస్తున్న యువత

సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయాలి

- ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 6: మొబైల్ ఫోన్ పొగొట్టుకుంటే తక్షణమే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ సిబ్బంది రికవరీ చేసి అప్పగిస్తారని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలోని సెల్‌ఫోన్లు పొగొట్టుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన అయిజ, శాంతినగర్, గద్వాల టౌన్, గద్వాల రూరల్, గట్టు, అలంపూర్ పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,332 ఫోన్లకు సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయగా 1,330 సెల్‌ఫోన్‌లను గుర్తించి అందులో ఇప్పటి వరకు 849 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని యాజమానులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ ఎస్సై రజిత, పోలీస్ సిబ్బంది రఘునాథ్‌రెడ్డి, ఆకాశ్, భీమేశ్, వీరేశ్, మస్తాన్, మహేశ్ తదితరులు ఉన్నారు.

అవార్డులతో మరింత బాధ్యత

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 6: అవార్డులు అధికారులకు మరింత బాధ్యతను పెంచుతాయని గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, గణేశ్‌కుమార్ తెలిపారు. గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ గెజిటెడ్‌గా అవార్డును అందుకున్న జీహెచ్‌ఎం శంకర్‌గౌడ్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సన్మానించి మాట్లాడారు. డీసీఈబీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అక్షరదీక్ష , విలువల విద్య, బాల సాహిత్య సభలవంటి కార్యక్రమాలతో విద్యార్థుల అభ్యున్నతికి శంకర్‌గౌడ్ కృషి చేశారని వివరించారు. హెచ్‌ఎంలు శంకర్‌గౌడ్‌ను శాలువా, పూలమాల, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శంకరయ్య, వరలక్ష్మి, సరస్వతి, రమాకాంత్, శ్రీకాంత్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, నరేందర్ ,శివయ్య, సరస్వతి, కృష్ణనాయక్, మల్లికార్జున్, సేవ్యానాయక్, శాంతన్న తదితరులు ఉన్నారు.

చిక్కరు.. దొరకరు

- ఉండవెల్లి ఎంపీడీవో కార్యాలయంలో వంతుల వారీగా విధులు
- రోజుకు ఒకరిద్దరు మాత్రమే హాజరు

ఉద్యోగులు లేక ఖాళీగా ఉన్న ఎంపీడీవో కార్యాలయం

ఉండవెల్లి, సెప్టెంబర్ 6: చిక్కరు.. దొరకరు సినిమా టైటిల్ కాదు ఉండవెల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల పనితీరుకు నిదర్శనం. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు వంతులవారీగా రోజూ ఒకరిద్దరు మాత్రమే విధులకు వస్తుండడం విశేషం. వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చే వివిధ గ్రామాలు ప్రజలు అధికారులు లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. శుక్రవారం సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ మాత్రమే విధులకు రావడంతో ప్రజాపాలన దరఖాస్తులతో వచ్చిన ప్రజలు అధికారులు చిక్కరు దొరకరు అని చర్చించుకున్నారు. ఎంపీడీవో వారంలో రెండురోజులు విధులకు వచ్చి మిగిలిన నాలుగు రోజులు గద్వాలలో ఉండడం విశేషం. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విధులకు హాజరు కాని ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై జెడ్పీ సీఈవో కాంతమ్మను వివరణ కోరగా.. ఈ విషయం ఇప్పటికే రెండు సార్లు తన దృష్టికి వచ్చిందని, వారిపై శాఖాపరమైన విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్, భగీరథ కాలనీ, E/F, 200 చ.గ.ల ప్లాటు అమ్మబడును, కంపౌండ్ వాల్, గేటు కలదు, క్లియర్ టైటిల్ సంప్రదించండి సెల్: 6301465612
NT-MBNR

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో